క్లుప్తంగా

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

ఇంద్రవెల్లి: భూ సమస్యలు పరిష్కరించేందుకు భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మండలంలో కొనసాగుతున్నాయి. బుధవారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో, డొంగర్‌గామ్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పట్టా పాస్‌బుక్కులు పేర్లు మార్పు, విస్తీర్ణం కొలతలు చేసేందుకు పలువురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'కళాశాలపై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలోని వేదాంత్ ప్రైవేట్ కళాశాల అక్రమ ఫీజులు వసూలు చేస్తున్నారని పీడీఎస్‌యూ నాయకులు ఆరోపించారు. బుధవారం డీఐఈవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మాయమాటలు చెప్పి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా సీతక్కను కొనసాగించాలి

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా సీతక్కనే కొనసాగించాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి సీతక్కకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై పట్టుందని, ఈ ప్రాంత సమస్యలు, స్థితిగతులు ఆమెకు తెలుసన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు మెస్రం భరత్, సోయం మురహరి, జుగ్నాక్ భరత్, జాలిం, గేడం భారత్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోండి

ఆదిలాబాద్‌రూరల్: వానాకాలం 2025 సీజన్‌కు సంబంధించి రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం పొందాలనుకుంటున్న నూతనంగా పట్టాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆదిలాబాద్ రూరల్ మండల వ్యవసాయాధికారి నాగేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ దరఖాస్తులను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ నెల 20లోగా అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, పట్టాదారు పాస్ పుస్తకం, భూమి వివరాలను జతచేయాలన్నారు. అర్హులైన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టిఫిన్ సెంటర్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఠాకూర్ హోటల్ సమీపంలోని టిఫిన్ సెంటర్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. క్రాంతినగర్‌కు చెందిన హోటల్ నిర్వాహకుడు సురేశ్ రాత్రి 9 గంటల ప్రాంతంలో హోటల్ మూసివేసి బుధవారం ఉదయం 4 గంటల ప్రాంతంలో టిఫిన్ సెంటర్‌కు చేరుకున్నాడు. వెనుక తలుపు పగలగొట్టి రూ.3వేల నగదు దొంగలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ(కె) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి నందు తెలంగాణ ట్రైబల్ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్ వరంగల్ జిల్లాలో సీటు సాధించాడు. విద్యార్థి సీటు సాధించడంపై పాఠశాల అధ్యాపకులు దేవిదాస్, ప్రకాశ మనోజ్, వరలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ప్రకాశ్ సన్మానించారు. సైనిక్ స్కూల్‌లో బాగా చదివి పాఠశాలకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏటీడీవో నిహారిక

తాంసి: పీఎం జన్మన్ పథకం ద్వారా కల్పిస్తున్న వసతులు, పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏటీడీవో నిహారిక సూచించారు. బుధవారం మండలంలోని గిరిగాం గ్రామంలో పీ ఎం జన్మన్‌లో భాగంగా ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. గిరిజనుల నుంచి వివిధ దరఖాస్తులు స్వీకరించారు. ఏటీడీవో నిహారిక మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో జీవనోపాధి మెరుగుపరిచేందుకు గ్రామాల్లో జూన్ 15 నుంచి 30 వరకు ప్రత్యేక క్యాంప్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏవో రవీందర్, ఎంపీడీవో మోహన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేశ్, ఏఈవో నిఖిత పాల్గొన్నారు.

ఏళ్లుగా నిరీక్షణ..!

- కులాంతర వివాహాలు చేసుకున్న వారికి అందని ప్రోత్సాహకాలు
- దళితాభివృద్ధి శాఖలో 87 దరఖాస్తులు పెండింగ్
- ఆందోళనలో దరఖాస్తుదారులు


జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: సమాజంలోని సామాజిక అసమానతాలను రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. అందులో భాగంగానే కులాంతర వివాహం చేసుకున్న దళితులకు ప్రభుత్వం వివాహ ప్రోత్సాకాన్ని అందజేస్తోంది. దాని కోసం డాక్టర్ అంబేడ్కర్ స్కీమ్ ఫర్ సోషల్ ఇంటిగ్రేషన్ త్రూ ఇంటర్ క్యాస్ట్ మ్యారేజెస్ పథకాన్ని 2013 ప్రవేశపెట్టింది. కులాంతర వివాహం చేసుకున్న దళితులకు సామాజిక భద్రతతో పాటు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. దళిత సామాజిక వర్గానికి చెందిన యువతీ లేదా యువకుడు ఇతర ఇందులో ఒకరూ తప్పనిసరిగా దళితులై ఉండాలి. కులాల వారిని పెళ్లి చేసుకుంటే అలాంటి జంటలకు ప్రభుత్వం రూ. 2.50 లక్షల పెళ్లి కానుక ఇచ్చి ప్రోత్సాహిస్తోంది. ఏడాదిలోపు పథకానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఏళ్ల తరబడి ప్రోత్సాహకం అందకపోవడం కులాంతర వివాహం చేసుకున్న పలు జంటలు వాపోతున్నారు.

87 దరఖాస్తులు పెండింగ్..

ప్రస్తుత సమాజంలో చాలా మంది కులాంతర వివాహం చేసుకుంటున్న సంఘటనలు చేస్తున్నాం. కుల, మతతత్వం పోవాలనే ఉద్దేశంతో వారికి ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందజేస్తున్న విషయం తెలిసిందే. వారికి సంబంధించిన శాఖల ద్వారా వీటిని అందజేస్తారు. దళిత సామాజిక వర్గానికి చెందిన వారు జిల్లాలో 87 మంది జంటలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే జిల్లాలో 2020 నుంచి వారికి ఆ ప్రోత్సాహకం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఏళ్లుగా ఎదురుచూపు..

జిల్లాలో కులాంతర వివాహం చేసుకున్న దళితులు ప్రోత్సాహం కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. ఆ ప్రోత్సాహం పట్ల చాలా మందికి అవగాహన లేకపోయినప్పటికీ, కొంత మందికి అవగాహన ఉన్నప్పటికీ ఆ ప్రోత్సాహకం సకాలంలో అందకపోవడంతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ప్రభుత్వం వివాహ ప్రోత్సాహకం సకాలంలో అందజేస్తే ఆ జంట ఏదైనా వ్యాపారం ఏర్పాటు చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందని పలు దళిత సంఘాల నాయకులు, వివాహ ప్రోత్సాహం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



కులాంతర వివాహం చేసుకున్న దళితులకు సామాజిక భద్రతతో పాటు ఆర్థిక భరోసాను కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయడం అభినందనీయం. డాక్టర్ అంబేడ్కర్ స్కీమ్ ఫర్ సోషల్ ఇంటి గ్రేషన్ త్రూ ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ పథకానికి దరఖాస్తులు చేసుకున్న జంటలకు సకాలంలో నిధులు విడుదల చేసి ప్రోత్సాహిస్తే బాగుంటుంది.

– మల్యాల మనోజ్ కుమార్, తెలంగాణ మాదిగ జేఏసీ, జిల్లా అధ్యక్షుడు

నిధులు రాగానే అందజేస్తాం



డాక్టర్ అంబేడ్కర్ స్కీమ్ ఫర్ సోషల్ ఇంటి గ్రేషన్ త్రూ ఇంటర్ క్యాస్ట్ మేరేజెస్ పథకానికి దరఖాస్తు చేసుకున్న జంటల నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిధులు రాగానే వారికి అందజేసి ప్రోత్సాహిస్తాం.

– సునీత కుమారి, జిల్లా దళితాభివృద్ధి శాఖ అధికారి

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. ధర్తి ఆబ జన్‌భాగిదారి అభియాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బొందిడి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న చోట దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయని తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఎస్‌సీఆర్పీ ప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, హెల్త్ అసిస్టెంట్ జగదీశ్వర్ రెడ్డి, ఏఎన్ఎం సంగీత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. మండల వైద్యాధికారి సర్ఫారాజ్ ఆదేశాల మేరకు బుధవారం అంకోలి పీహెచ్‌సీ పరిధిలోని మావల మండలం వాఘపూర్ సబ్‌సెంటర్ పరిధిలోని మాలేబోరిగాం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. స్వల్ప అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి మాత్రలు అందజేశారు. రక్త నమూనాలను సేకరించారు. అంకోలి పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకులు బి. సుభాష్, ఆరోగ్యసహాయకులు గేడం సంగీత, నల్ల ఈశ్వర్ రెడ్డి, ల్యాబ్ టెక్నిషన్ పల్లవి, ఫార్మాసిస్ట్ అరుణ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలి



రెవెన్యూ సదస్సులో అధికారులు

సాత్నాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విశ్వనాథ్ అన్నారు. రామాయి గ్రామంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 17 రెవెన్యూ గ్రామాలు ఉన్న మండలంలో నేటితో రెవెన్యూ సదస్సులు ముగియనున్నాయని, ఇప్పటివరకు మొత్తం 286 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, రికార్డ్ అసిస్టెంట్ వెంకటేశ్, ధరణి ఆపరేటర్ నరసింహులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సైనికుడికి సన్మానం


సైనికుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల భారత్ నిర్వహించిన ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని ఇంటికి వచ్చిన ఉట్నూర్ మండలంలోని లింగోజీతండా ఎక్స్ రోడ్డు గ్రామానికి వచ్చిన ఆర్మీ జవాన్ ఆడే శ్రీనివాస్‌ను మాజీ సర్పంచ్ హరినాయక్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. యుద్ధంలో పాల్గొని ధైర్య సాహసాలు ప్రదర్శించిన జవాన్‌ను అభినందించారు. కార్యక్రమంలో జాదవ్ శివాజీ, వినోద్, వెంకటేశ రవికిరణ్, అజయ్, విజయ్, రాహుల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

ఇంద్రవెల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ కృషి చేస్తుందని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంతో పాటు మండలంలో గ్రామీణ ప్రాంతంలో తరుచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల స్థలాలను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న స్థలాలను గుర్తించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్సై సాయన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు తనిఖీ

- జేసీబీ, ఇసుక డంప్‌ల సీజ్


ఇసుక డంప్ పరిశీలిస్తున్న అధికారులు

జైనథ్: మండలంలోని పెన్‌గంగ నది పరివాహక ప్రాంతాలైన సాంగ్వీ, ఆనంద్‌పూర్ గ్రామాల్లో అక్రమంగా సాగుతున్న ఇసుక తవ్వకాలపై సాక్షిలో 'యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా' శీర్షికన బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు స్పందించారు. మండల తహసీల్దార్ ఆత్రం నారాయణ, ఎస్సై పవర్ గౌతమ్, మైనింగ్ అధికారి ప్రకాష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉల్లాస్‌లు ఆయా గ్రామాల్లోని ఇసుక తవ్వకాలను తనిఖీ చేశారు. ఆనంద్‌పూర్‌లో తవ్వకాలకు వినియోగిస్తున్న జేసీబీని, 14 ట్రాక్టర్‌లను, ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. పెన్‌గంగలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

డ్రెయినేజీ పూడికతీత పనులు ప్రారంభం


జేసీబీతో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

కైలాస్‌నగర్: వర్షాకాలం సీజన్ ప్రారంభమైన ఆదిలాబాద్ పట్టణంలోని డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించకపోవడాన్ని ప్రస్తావిస్తు 'వరద ముప్పు తప్పేనా' శీర్షికన ఈనెల 8న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి బల్దియా అధికారులు స్పందించారు. డ్రెయినేజీల్లో నిండిన చెత్తచెదారం తొలగింపు పనులను ప్రారంభించారు. బుధవారంజేసీబీల సాయంతో చెత్తను తొలగించి ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. అర్చా గార్డెన్, పంజాబ్ చౌక్‌లోని భారీ డ్రెయినేజీల వద్ద జరుగుతున్న పూడిక తీత పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ బైరి శంకర్ పర్యవేక్షించారు.

పిల్లలను పాఠశాలలకు పంపించాలి


మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులను వెంటనే పాఠశాలలకు పంపించాలని ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. హాజరు అంతంతే శీర్షికన బుధవారం ×సాక్షి¶ దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు, ఉపాధ్యాయులు వారి వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల గ్రామాలను సందర్శించారు. పాఠశాలలు పునః ప్రారంభమై వారం గడుస్తున్నా.. తల్లిదండ్రులు వారి పిల్లలను వెంటనే పాఠశాలకు పంపించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జైనథ్: పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలని మండల అభివృద్ధిశాఖ అధికారి రవీందర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రానున్నది వర్షాకాలం కావున ప్రతీ ఒక్క కార్యదర్శి గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

బోథ్: యోగాతో విద్యార్థుల్లో ఒత్తిడి దూరమవుతుందని బోథ్ మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ సంగీత, యోగా శిక్షకురాలు మునిగెల యోగిత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం యోగా దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం బోథ్ మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో యోగా శిక్షకురాలు మునిగెల యోగిత విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగా వల్ల విద్యార్థులకు మానసిక ప్రశాంతత, ఆత్మస్థైర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి. సంగీత, వైస్ ప్రిన్సిపల్ బి.లత, పీటీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతీ పేదవాడికి అందేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం మండలంలోని శాంతినగర్, ఫకీర్‌గుట్ట కాలనీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ధ్రువీకరణ పత్రాలు అందచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


మాట్లాడుతున్న అలీప్ ఆర్గనైజేషన్ ప్రతినిధి స్వరూప

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సభ్యులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రాథోడ్ రవీందర్ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రెన్రియర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్‌పై బుధవారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో గల మహిళా సమైఖ్య జిల్లా కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన, నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్‌లో పాటించాల్సిన మెళుకువలు, నైపుణ్యాభివద్ధి శిక్షణపై 15 రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. అలీప్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు స్వరూప, లక్ష్మీప్రసన్న, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయ బృందాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఏఎల్ఈఏపీ (అసోసియేషన్ ఆఫ్ లేడి ఎంటర్‌ప్రెనియర్ ఆఫ్ ఇండియా) ప్రపంచ బ్యాంక్ నిధులతో నిర్వహిస్తున్న ఆర్ఏఎంపీలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా మండల కేంద్రంలో మహిళలకు అవగాహన సదుస్సు నిర్వహించారు. ఏపీడీ గోవింద్‌రావు మాట్లాడుతూ.. ఔత్సాహిక మహిళలకు పరిశ్రమ నిర్వాహణ, ఉత్పత్తుల మార్కెటింగ్, మెళుకువలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు.

పీఈసెట్‌లో రాష్ట్రస్థాయిలో సత్తా


వీరేష్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు, కుటుంబసభ్యులు

ఆదిలాబాద్/తలమడుగు: జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025 ఫలితాల్లో సత్తా చాటారు. తలమడుగు మండల కేంద్రానికి చెందిన నీలగిరి సాయిమిత్ర 12వ ర్యాంకుతో మెరిసింది. అదే విధంగా జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన తైక్వాండో మాస్టర్ అన్నారపు వీరేష్ మంగళవారం విడుదలైన సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 40వ ర్యాంకు సాధించడం విశేషం. రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకు సాధించడం పట్ల సాహో తైక్వాండోక్లబ్ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించాలి


అవగాహన కల్పిస్తున్న ఎంఈవో

నార్నూర్: ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. బుధవారం మండలంలోని గుండాల, శేకుగూడ గ్రామాలతో పాటు మండల కేంద్రంలో ఉపాధ్యాయ సిబ్బందితో ఇంటింటికి తిరుగుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, నిర్మల, ఈశ్వర్ చౌహాన్, ప్రమోద్ రాథోడ్ పాల్గొన్నారు.

బోథ్: సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బడిబాట కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అడ్మిషన్ హెల్ప్‌డెస్క్‌లో దాదాపు 60 మంది విద్యార్థులు పాఠశాలలో అడ్మిషన్ పొందారు. అనంతరం ఉపాధ్యాయులు పాఠశాలలో మొక్కలు నాటారు.

అదర్శంగా అభిమన్యు వాట్సాప్ గ్రూప్

- బాధిత కుటుంబాలకు రూ. 1,41,100 అందజేత


నగదు అందజేస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు

నార్నూర్: ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతం కేంద్రంగా ఏర్పాటు చేసిన అభిమన్యు వాట్సాప్ గ్రూప్ అదర్శంగా నిలుస్తోంది. అపదలో ఉన్న ఆదివాసీ గిరిజనులకు అండగా ఉండమే కాకుండా వారికి చేయూతను అందిస్తూ.. సామాజిక సేవతో ప్రశంసలు అందుకుంటూ.. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తోంది. వారం రోజుల క్రితం గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన పెందూర్ మాదవ్‌రావు, పెందూర్ సుజాత, సీడం రాంబాయి, మంగం భీంబాయిలు పిడుగుపాటుతో మృతి చెందగా దాదాపు పదిమంది గాయపడిన విషయం విదితమే. వారి ఆర్థిక పరిస్థితి అంతంతగా ఉండడంతో చేయూతను అందించడానికి అభిమాన్యు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ మెస్రం శేఖర్‌బాబు వారి దిన పరిస్థితిపై వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయగా దాతలు, గ్రూపు సభ్యులు స్పందించి రూ. 1,41,100 నగదును జమ చేశారు. ఆట్టి నగదును బుధవారం గొండ్వానా పంచాయతీ జిల్లా రాయి సెంటర్ సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్ చేతుల మీదుగా పిప్రి గ్రామంలో బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేశారు. సిడం భీంరావు, జుగ్నాక భీంరావు, మందాడి దౌలత్‌రావు, కోట్నాక్ దేవురావు, ఆత్రం నాగోరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మంత్రులను కలిసిన కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్/నేరడిగొండ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా మంత్రిగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. అలాగే రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖల మంత్రిగా బాధ్యతల ను స్వీకరించిన వివేక్ వెంకట స్వామిని కలిశారు.

గిరిజనశాఖ కమిషనర్‌ను కలిసిన నాయకులు

కైలాస్‌నగర్: ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మర్సుకోల బాపురావు, ఉట్నూర్ మాజీ ఎంపీపీ పంద్రం జయవంత్‌రావులు బుధవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శరత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

వర్షానికి కూలిన పాఠశాల గోడ

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల గోడ ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోయింది. గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు తరగతి చేరుకోవడంతో, ఆ గదిని ఖాళీగా ఉంచుతున్నారు. కాగా వర్షం ధాటికి తరగతి గోడ కూలింది. సాయంత్రం గోడ కూలిపోవడంతో ఎలాంటి ఆస్తి నష్టం సంభవించలేదు. పాఠశాలకు నూతన తరగతుల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించాలని వినతి

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీసీడీపీ నిధులు, ఐటీడీఏ ద్వారా పీటీజీ గిరిజనులకు కట్టించిన ఇంటినిర్మాణం బిల్లులు ఇంకా రావడం లేదని త్వరలో బిల్లులు విడుదల చేయాలని కోరుతూ ఉట్నూర్ మాజీ ఎంపీపీ జైవంత్‌రావు హైదరాబాద్‌లోని రాష్ట్ర గిరిజనశాఖ కమిషనర్ శరత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. అదే విధంగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయన వెంట మర్సుకోల బాపురావు, తదితరులు ఉన్నారు.